www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 7 డిసెంబర్ 2025

5

కాకినాడ

ఎస్‌సి విద్యార్థులపై కుల వివక్ష తగదు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని యండపల్లి జడ్‌పి హైస్కూల్లో ఎస్‌సి విద్యార్థుల పట్ల కుల వివక్ష తగదని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యకులు మొహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ కమిటీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను కలుసుకుంది. పాఠశాల హెచ్‌ఎం సురేష్ భూషణ్ విద్యార్థులను కించ పరిచేలా మాట్లాడడం, అసభ్య పదజాలంతో దూషించడం, వారి తల్లిదండ్రుల వృత్తులను అవహేళన చేయడం వంటి వాటిపై విచారించింది. తమ విచారణలో హెచ్‌ఎం తీరు సరిగా లేదని నిర్ధారణ అయిందని మొహమ్మద్ ఇక్బాల్ అన్నారు. ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలలకు పంపించడం సరికాదన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కార్యవర్గ సభ్యులు పి పవన్, పి.సూర్య పాల్గొన్నారు.

వాలంటీర్లను విస్మరించిన సర్కారు

- ఉద్యోగ భద్రత లేక అవస్థలు
- హామీ అమలు కోసం ఎదురు చూపులు
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల లబ్ధి కోసం కూటమి పార్టీల పెద్దలు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలను ఇచ్చారు. దానిలో భాగంగానే వాలంటీర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు వారికి సైతం హామీలను ఇచ్చింది. తాము అధికారంలో వస్తే వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించడమే కాకుండా, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వారికిచ్చిన హామీను మరచి వాలంటరీ వ్యవస్థను పక్కన పెట్టింది. 18 నెలలు గడుస్తున్నా వారిని పట్టించుకోవడమే మానేసింది. వారిని తిరిగి తీసుకునే ఆలోచనలోనే ప్రభుత్వం లేనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలలో ఇచ్చిన హామీ అమలు కోసం, తమ ఉద్యోగ భద్రతకై వాలంటీర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అప్పటి సిఎం జగన్ రెన్యువల్ చేయకపోవడంతో వాలంటీర్లు ఇప్పుడు ఉద్యోగాల్లో లేరని, ఎన్నికల సమయంలో 80 శాతం మంది వాలంటీర్లను జగన్ రాజీనామా చేయించారని కూటమి పెద్దలు చెప్పుకొస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉన్న పంచాయతీల్లో 1271 గ్రామ సచివాలయాలు, పట్టణ, నగర పంచాయతీలు, నగరాల్లో గల 319 వార్డుల్లో 1,116 వార్డు సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 కుటుంబాలకు ఒక గ్రామ వాలంటీర్‌ను, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 100 కుటుంబాలకు వార్డు వాలంటీర్లను నియమించారు. ఆయా కుటుంబాల పరిధిలో ప్రభుత్వం తరపున సేవలు అందించేవారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వీరి ద్వారా గత ప్రభుత్వం అమలు చేసింది.

కొనసాగిస్తామని ఎన్నికల హామీ

తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, ఎవరూ రాజీనామాలు చేయొద్దని, అంతేకాకుండా ప్రభుత్వాన్ని స్థాపించిన తర్వాత వాలంటీర్లను కొనసాగిస్తూనే రూ.10 వేలు వేతనం ఇస్తామని ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబు చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా వీరిని కొనసాగింపుపై నేటికీ కూటమి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం చేయడంలో తాత్సారం చేస్తూనే ఉంది.

ఆందోళన చేస్తున్న వాలంటీర్లు (ఫైల్ ఫోటో)

ప్రశ్నార్థకంగా వాలంటీర్ల భవిష్యత్

గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియమించబడిన వాలంటీర్లను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తూ వచ్చారు. అయితే ఎన్నికలకు ముందు హైకోర్టు ఆదేశాలతో వీరి కాల పరిమితిని రెన్యువల్ చేయలేదు. దీంతో వాలంటీనకల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కోసం వీరికి ఎదురుచూపులే మిగిలాయి. గత ప్రభుత్వం కొంతమంది వాలంటీర్లను బలవంతంగా రాజీనామా చేయించింది. అయితే ఇందులో కొందరు స్వచ్ఛంధంగా రాజీనామా చేసి ఇతర ఉపాధి మార్గాల వైపు వెళ్లిపోయారు. అయితే కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్ళతో పలువురు బలవంతంగా రాజీనామాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉద్యోగ భద్రత కరువై...

వాలంటీర్ల వ్యవస్థలో 85 శాతం మంది గృహిణులే ఉన్నారు. దూరంగా వెళ్లి ఎటువంటి పనులు చేసుకోని వాళ్ళు ఇంటి వద్ద ఉంటూ స్థానికంగా వాలంటీర్లుగా పనిచేసేవారు. దీని ద్వారా కొంతైనా ఆసరా ఉండేదని, కుటుంబ పోషణకు ఉపయోగపడేదని పలువురు మహిళా వాలంటీర్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం తమను కొనసాగించడంపై నేటికీ స్పష్టత ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు.

రాజకీయంగా వాడుకున్నారు

గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమను రాజకీయాలకు వాడుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మా ద్వారా గత వైసిపి అమలు చేయించింది. ఎన్నికలలో లబ్ధి పొందడం కోసం కొనసాగిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి.

-ప్రకాష్, వాలంటర్ల సంఘం నాయకులు, కాకినాడ

పోరాటం కొనసాగిస్తాం



ఎన్నికల ముందు హామీలు, ఎన్నికల తర్వాత వెన్నుపోటుకి వాలంటీర్లు బలయ్యారు. మా ఉపాధి కోసం ఊపిరి ఉన్నంత వరకూ పోరాడటం మినహా మరొక మార్గం లేదు. ఇప్పటికే అనేకసార్లు ఆందోళనలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలను అందజేశాం.

-వరుణ్, వాలంటర్ల సంఘం జిల్లా కన్వీనర్

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎన్నికలలో లబ్ధి కోసం కూటమి పార్టీలు వాలంటీర్లను తిరిగి నియమిస్తామని హామీ ఇచ్చింది. వారికి ఉద్యోగ భద్రత లేక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇంటి వద్ద ఉంటూ కాస్తో కూస్తో కొంత ఉపాధిని పొందేవారు. ప్రస్తుతం అది లేకుండా పోయింది. వాలంటరీ వ్యవస్థను కొనసాగించాలి.

-చెక్కల రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కాకినాడ జిజిహెచ్‌లో వార్డులను సందర్శిస్తున్న రాష్ట్ర మంత్రి సుభాష్

జిజిహెచ్‌లో మంత్రి తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి కార్డియాలజిస్టును నియమించేందుకు కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ, జనరల్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న పలువురిని ఆయన పరామర్శించి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వాహణపై ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లావణ్యకుమారి, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జిజిహెచ్‌లో వైద్య సిబ్బంది కొరత ఉందని, ముఖ్యంగా గుండె వైద్య నిపుణులు నియామకం లేక రోగులు ఇబ్బంది పడుతున్నట్లు వారు మంత్రికి వివరించారు. ఇప్పటి వరకు పనిచేసిన వైద్యురాలు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసి వెళ్లడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గుండె అత్యవసర వైద్యం దృష్ట్యా వైద్యుల నియామకానికి చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిసిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత తొందరగా కార్డియాలజిస్ట్ నియామకానికి కృషి చేస్తానన్నారు. ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ పర్యటనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, ఆసుపత్రి పరిపాలనాధికారి ఎం.శ్రీధర్, సిఎస్ ఆర్ఎంఒ కోమలి, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

జెసిగా అపూర్వ భరత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ

జాయింట్ కలెక్టర్‌గా అపూర్వ భరత్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇంతకుముందు ఆయన చింతూరు ఐటిడిఎ పిఒగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిఆర్ఒ జె.వెంకట్రావు, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణ రాజు, జిల్లా మేనేజర్ డి.దేవులనాయక్, దేవాదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, దేవదాయ శాఖ తనిఖీదారుడు వి.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ వి.జితేంద్ర, కలెక్టర్ కార్యాలయ ముఖ్య విభాగ అధిపతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి అపూర్వభరత్

సమావేశంలో మాట్లాడుతున్న సాయిప్రసాద్

సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతీ ఒక్కరి సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రాపర్టీ బజార్ లక్ష్యమని సంస్థ ఎండి శివసత్యసాయిప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ సొంత గూడు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. అయితే కానీ ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పరిస్థితి సొంత ఇల్లు సమకూర్చుకోవడం సామాన్య, మధ్య తరగతి వారికి కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాపర్టీ బజార్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ ఫెస్ట్ -2025 పేరుతో ఈనెల 7న నగరంలోని ఎపిఎస్‌పి ఎదురుగా ఉన్న పవిత్ర అవెన్యూస్ గేటెడ్ కమ్యూనిటీలో ఇయర్ ఎండింగ్ బిగ్గెస్ట్ డిస్కౌంట్ ఆఫర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్థిరాస్తి కొనాలనుకునే వారు ఈ కార్యక్రమంలో పాల్గొని సొంత ఇంటిని సమకూర్చుకోవాలన్నారు. అందుబాటు ధరల్లో మంచి ప్రాంతాల్లో సొంత ఇంటిని కొనుగోలుదారులు అనుకున్న బడ్జెట్లో ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం అంబేద్కర్ ఆలోచనా విధానం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు జిల్లావ్యాప్తంగా అధికారులు, అంబేద్కర్‌వాదులు, వామపక్ష ప్రజాసంఘాలు ఘనంగా నివాళులర్పించారు. భారతదేశానికి ఒక దృఢమైన రాజ్యాంగాన్ని అందించారని, ఆయన ఆలోచనా విధానం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ దృఢమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆలోచనా విధానం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఎన్‌విివి.సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ శోభారాణి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, దళిత, బహుజన, ప్రజాసంఘాలు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి భారతదేశానికి ఉత్కృష్టమైన రాజ్యాంగాన్ని అందించిన ఘనత డాక్టర్ బిఆర్‌అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు. ఆయన చదువుకోవడానికి ఏమాత్రం అవకాశం లేని పరిస్థితుల నుంచి అత్యున్నత స్థాయికి చేరుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్‌ఇ వెంకటరావు, దళిత, బహుజన, ప్రజాసంఘాలు నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ బాయ్స్ హాస్టల్లోనూ, ప్రభుత్వ ఐటిఐలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.లోవరాజు, ఎం.గంగా సూరిబాబు పాల్గొని అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవ్, సత్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిజిహెచ్ ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, ఎం.హరనాథ్, సిహెచ్.విజయ్‌కుమార్, ఎస్.వాసు, వివిఎన్.కుమార్ పాల్గొన్నారు. అలాగే కచేరి పేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్, బుడితి సురేష్ కుమార్, కె.సింహాచలం, కె.పద్మనాభం, ప్రజా సంఘాల జిల్లా నాయకులు కె.వీరబాబు, యు.సత్యనారాయణరెడ్డి, టి.రాజా పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు, వివిధ ప్రభుత్వ పాఠశాలలు, పలు గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, వైసిపి నాయకులు నీలపల్లి అప్పారావు, జనసేన పార్టీ నాయకులు కురుమళ్ళ నాగేశ్వరరావు, బడ్డుకొండ వెంకటరమణ పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గడిగట్ల సత్తిబాబు, టిఎల్.పద్మావతి, సిరపరపు శ్రీనివాస్, రొంగల వీర్రాజు, ఎస్.బంగారురాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. **తాళ్లరేవు** స్థానిక మండల పరిషత్ కార్యాలయం, జై భీమ్ పేట, సుంకటరేవులోని అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత పాల్గొన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద టేకుమూడి ఈశ్వరరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్న జనార్ధనరావు, జడ్‌పిటిసి దొమ్మేటి శ్యామ్యూల్ సాగర్, వళ్ల రాజబాబు, నాయకులు ధూళిపూడి బాబి, మందాల గంగ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక మండల పరిషత్, ఎస్‌సి పేటలో జరిగిన కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వి.సాగర్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటేశ్వరరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి మనోహర్, బొబ్బరోడా దావీదు, లింగం అర్జున్, ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక బ్రౌన్ పేట సెంటర్లో అంబేద్కర్ యువజన సంఘం, బలుసుల పేట, మండల పరిషత్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అచ్చంపేట మండల ప్రజాపరిషత్ యుపి పాఠశాలలో హెచ్‌ఎం వేదాద్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, డిప్యూటీ ఎంపిడిఒ మల్లాడి భైరవమూర్తి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్‌రావు, ప్రజాసంఘాల నాయకులు బాలం శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, టిఎల్ పద్మ, సిరిపురపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి

సామర్లకోటలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

పెద్దాపురంలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

కార్టూన్ 'నిజం'



వైద్య సేవల లేమిపై నిలదీత

ప్రజాశక్తి - కరప

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందడం లేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని, సబ్ సెంటర్లలో మందులు ఉండటం లేదంటూ ఎంపిటిసిలు అధికారులను నిలదీశారు. రోగులకు సరియైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలను పొందుతూ అధిక డబ్బును ఖర్చు చేస్తున్నారని అన్నారు. దీనిపై డాక్టర్ ఏంజలీనా వివరణ ఇచ్చారు. ఎంపిడిఒ జె.శ్రీనివాస్, తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్ వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో డిప్యూటి ఎంపిడిఒ సలాది శ్రీనివాస్, ఎంఇఒ కెవి.కృష్ణవేణి, జెఇ శైలజ, హౌసింగ్ ఎఇ నాగేష్, ఎఇ ఐ.సత్య, కార్యాలయ సూపరింటెండెంట్ నరసింహ, ఎపిఎం సత్యవతి, వేములవాడ సొసైటీ ఛైర్మన్ దూడల నారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి

ధర్నా చేస్తున్న టిడ్కో గృహ లబ్ధిదారులు

రుణాల రద్దు కోసం టిడ్కో లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట

రుణాలను తక్షణమే మాఫీ చేయాలని టిడ్కో గృహాల లబ్ధిదారులు శనివారం ధర్నా చేపట్టారు.స్థానిక జగ్గమ్మ గారి పేటలోని టిడ్కో సముదాయాల వద్ద మహిళలు ఆందోళన నిర్వహించారు. పదేళ్ల క్రితం గృహాలను అప్పగించక ముందే రుణాల మంజూరు, వడ్డీలు వేయడంతో బకాయిలు భారీగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి తమ వాటాలను చెల్లించామని, ఇప్పటికీ లబ్ధిదారులకు చాలా గృహాలు అప్పగించని పరిస్థితి ఉందన్నారు. నాడు కట్టిన లబ్ధిదారుని వాటాకు సంబంధించిన అప్పుకు వడ్డీలు చెల్లిస్తూ నేటికీ అద్దె గృహాల్లో నివస్తున్నట్లు వారు వాపోయారు. రుణాల బకాయిలను ఒకేసారి వారం రోజుల్లో చెల్లించాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని తక్షణమే రుణాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సింగరంపాలెంలో శుక్రవారం 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న సింగరంపాలెం, రామయ్యపాలెం, కె.గోపాలపురం గ్రామాల ప్రజలకు ఈ సబ్‌స్టేషన్ ద్వారా ఆ బాధ తీరుతుందన్నారు. రూ.3.29 కోట్లతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించినట్లు చెప్పారు. సబ్ స్టేషన్ నిర్మించేందుకు స్థలాన్ని దానం చేసిన మోహనరావుని ఆయన అభినందించారు. అలాగే గండేపల్లిలో 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, కుంచే రాజా, జాస్తి వసంత్, ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ ప్రసాద్, ఇఇ వీరభద్రరావు, ఎడి మలాకి, ఎఇ కిరణ్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జ్యోతుల

వైసిపి టిఎఫ్ అధ్యక్షునిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైసిపి టీచర్స్ ఫెడరేషన్ (వైసిపి టిఎఫ్) డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులుగా తాళ్ళరేవు మండలం నీలపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రేవు నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసిందని శనివారం ఆయన మీడియాకు తెలిపారు. ఈ సందరర్భంగా నాగేశ్వరరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

నాగేశ్వరరావు

నేరాలు ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - జగ్గంపేట

కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ హత్య చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇద్దరి మధ్య వ్యక్తిగత కక్షలే ఈ హత్యకు దారి తీశాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... భూపాలపట్నంకు చెందిన కాకర అప్పన్న (48)కు అదే గ్రామానికి చెందిన పూల రాజిబాబు మధ్య వ్యక్తిగత కక్షలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి అప్పన్న రక్తపు గాయాలతో రోడ్డు పక్కన కాలువలో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి సిఐ వైఅర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి, జగ్గంపేట ఎస్ఐలు సతీష్, రఘునాధరావు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాలను రప్పించి విచారించగా జాగిలం రాజిబాబు ఇంటి వైపుకు వెళ్ళాయి. దీంతో ఒంటరిగా వస్తున్న అప్పన్నను రాజిబాబు దాడి చేసి హత్యచేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసును సిఐ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి తరలించారు. కేసు విచారణ జరుగుతుందని, ఇంకా ఎవరిని అదుపులోకి తీసుకోలేదని సిఐ తెలిపారు.

2,700 లీటర్ల డీజిల్ స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానాం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 2,700 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని రవాణా చేస్తున్న రెండు వాహనాలతోపాటు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆటోలో 700 లీటర్ల డీజిల్ తరలిస్తున్న కాకినాడకు చెందిన వ్యక్తిపైనా, బొలెరో వ్యాన్‌పై 2,000 లీటర్ల డీజిల్ ఆయిల్ తరలిస్తున్న యానాంకు చెందిన వ్యక్తిపై కేసులు నమోదు చేశామన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

చొల్లంగి బ్రిడ్జి వద్ద శుక్రవారం ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాకినాడ రూరల్ పగడాలపేటకు చెందిన చోడిపల్లి చంద్రరావు (72) చేపల వేటకు వెళుతుంటాడు. సాయంత్రం సుమారు 4 గంటలకు ఇంటి నుంచి చొల్లంగి వంతెన వైపునకు వెళ్తుండగా ఉప్పలంక సరళ రైస్ మిల్లు సుమారు 6 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతనిని 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం మృతుని కోడలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సూరిబాబు తెలిపారు.

పేకాడుతున్న వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని రెండుచోట్ల పేకాడుతున్న వారిని అరెస్టు చసినట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉసులుమర్రు పరిధిలో పేకాడుతున్న నలుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.4,170 నగదు, ఖండవల్లిలో పేకాడుతున్న 10 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.20,010 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గంజాయి స్వాధీనం : మహిళ అరెస్టు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సీతానగరం పోలీసులు గంజాయి రవాణా చేస్తున్న ఒక మహిళను అరెస్టు చేశారు. ఆమె నుంచి రూ.50 వేల విలువైన 7.23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. ఆమెను మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన హబీబా ఖాన్‌గా గుర్తించారు. ఆమెను కోర్టులో హాజరు పరచగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు ఆరు రోజులు రిమాండ్ నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

అధికార పార్టీ నేతల వివక్ష తగదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పేదల నివసించే ప్రాంతాల పట్ల అధికార పార్టీ నేతలు వివక్ష చూపుతున్నారని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. శనివారం ఆనూరు గ్రామంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడారు.కాలనీలో 25 సంవత్సరాల నుంచి 115 పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. అనేక పోరాటాల ఫలితంగా 75 మందికి పట్టాలు మంజూరయ్యాయన్నారు. ఇంకా 40 మందికి పట్టాలు ఇవ్వాల్సివుందన్నారు. అనంతరం కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, మంచినీటి సదుపాయం కల్పించాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సమస్యల పరిష్కారానికి సోమవారం చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కడితి సతీష్, కుంచె అంజిబాబు, రెడ్డి దుర్గాదేవి, పైడిమళ్ల నాగరాజు, కొల్లి ఏసియా, బత్తిన చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం రామకృష్ణ ధ్యాన మందిరంలో శనివార ఉచిత పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్ఫోసిస్ సుధా మూర్తి సౌజన్యంతో రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు రూ.2 లక్షల విలువైన పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ మన్యం కృష్ణవేణి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పార్దేశ్ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ డిస్పెన్సరీ ఇన్‌ఛార్జ్ స్వామి లోకమయానంద మహరాజ్, సిఐ అంకబాబు, హెల్త్ సెంటర్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక అంబేద్కర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక చైతన్య పౌల్ట్రీ ఫారం కాంప్లెక్స్ వద్ద పౌల్ట్రీ ఫారం యజమాని గొర్రిపాటి చందు చేతుల మీదుగా పేదలకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామయ్య, సేవా సంస్థ అధ్యక్షులు మారే కన్నబాబు, కార్యదర్శి పిల్లి నూకరాజు, మణికుమార్, రేగి సోనీ, మక్కా లోవరాజు, ఐతే సతీష్ పాల్గొన్నారు.

ఊరించి..ఉసూరునిపించి...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో గత వార్యంలో చేపట్టిన పర్యటన మెట్టరైతులను ఊరించి ఉసూరు మనిపించింది. భూగర్భ జలాలు అట్టడుగునకు చేరిన జాబితాలో జిల్లాకు 3వ స్థానం లభించిన విషయం విదితమే. డెల్టా రైతుల సంగతి ఎలా ఉన్నా... జిల్లాలో మెట్ట రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే సగంలో నిలిచిపోయిన ఎత్తిపోతల పథకాలకు నిధులు విదిలించి జలవనరులపై ఆశాజనకమైన ప్రకటన చేస్తారని రైతన్నలు ఆశించారు. రైతన్నా మీకోసం పేరుతో నిర్వహించిన కార్యక్రమం రైతుల సంగతి ఎలా ఉన్నా టిడిపి ప్రచార యావకు దర్పణం పట్టింది. కార్యక్రమం ఆద్యంతం ఎంపిక చేసిన రైతులతో అధికార యంత్రాంగం ఇచ్చిన స్క్రిప్టును కొంత మంది అప్పజెప్పేశారు. ఎంఎల్ఎ మరో అడుగు ముందుకు వేసి ముఖ్యమంత్రిని మహానుభావుడు అంటూ కీర్తించారు. తన నియోజకవర్గంలో కీలకమైన తాడిపూడి లిఫ్ట్-5 కాలువ పనులు పూర్తి చేయాలని గానీ, ఎర్రకాలువ ముంపు నుంచి రైతులను కాపాడాలని గానీ కోరకపోవటం ఆయన చిత్తశుద్ధికి దర్పణం పట్టింది. ఈ రెండింటితోపాటు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే ఈ రెండింటి కింద 2 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశం ఉన్నా ఎంఎల్ఎ అడిగే ధైర్యం చేయలేకపోయారు. సిఎం చంద్రబాబు ఎప్పటిలానే తన స్టైల్‌లో పంచవర్ష ప్రణాళిక పేరుతో రైతులకు మాటలతో లాభాల పంట పడించారు. అనంతరం సభను మమ అనిపించి కార్యకర్తలతోసమావేశమై వచ్చిన దారిన వెనుతిరిగారు.

భయపెడుతున్న స్క్రబ్ టైఫస్

స్క్రబ్ టైఫస్ వ్యాధి ఉమ్మడి జిల్లా వాసులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇప్పటికే కాకినాడ జిల్లాలో పదుల సంఖ్యలో వెలుగులోకి వచ్చి రోగులు చికిత్స పొందుతున్న విషయం విధితమే. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలో అసలు కేసులే లేవంటూ వైద్య శాఖ అధికారులు గుప్పిస్తున్న ప్రకటనలపై బిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరీక్షలకు కేవలం కాకినాడ జిజిహెచ్‌లో మాత్రమే ఆర్‌టిపిసిఆర్, విఆర్‌డిఎల్ పరీక్షలు చేస్తున్నారు. అక్కడ వ్యాధిని గుర్తించి సేవలందిస్తున్నారు. మిగిలిన రెండు జిల్లాలో ఈ సేవలు లేకపోవటంతో తాత్కాలిక ఉపశమన మాత్రలు అందజేసి వెనక్కి పంపిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ రెండు జిల్లాల్లోనూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పిటిఎంల పేరుతో ప్రచార ఆర్భాటం

పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యాక్రమాలకు ప్రచార ఆర్భాటానికి వేదికలా మారాయి. కేరళ రాష్ట్రంలో ఈ కార్యక్రమం ద్వారా అక్కడి ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి దిశగా అడుగులు వేయించింది. దీంతో అక్కడ నాణ్యమైన విద్య అందరికీ అందించేలా పరస్పర సహకారం ఊతమందించింది. రాష్ట్రంలో ఈ కమిటీల్లో రాజకీయ జోక్యం పెరిగిందని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తినవిషయం విదితమే. తాజాగా మరో అడుగులు ముందుకు వేడుకలను సైతం నిర్వహించారు. పాఠశాలల్లో

సమస్యలు గానీ, ఆ సమస్యలు పరిష్కారాలకు గానీ ఎటువంటి చర్చలు నిర్వాహించకపోవడం అధికార యంత్రాంగం చిత్తశుద్ధిని దర్పణం పడుతోంది. ప్రజాప్రతినిధులైనా ఆ దిశగా చొరవ చూపకపోతే ప్రచార సంగతి ఎలా ఉన్నా తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ధాన్యం రైతుల్లో వాతావ'రణం'

వరుస తుపాన్ల నేపథ్యంలో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. గత నెలలో మొంథా తుపాను నష్టాలలో ముంచేసిన విషయం విదితమే. తాజాగా ఈ వారంలో దిత్వా తుపాను రైతన్న వెన్ను విరిచింది. వర్షాలు, మరోవైపు వాతావరణం చల్లగా ఉండటంతో ధాన్యంలో తేమశాతం తగ్గకపోవటంతో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు చుక్కెదురైంది. దీంతో గతి లేని పరిస్థితుల్లో అన్నదాతలు వ్యాపారులకు విక్రయించక తప్పలేదు. బస్తాకు రూ.200 చొప్పున నష్టపోయామని ఎకరాలకు 30 బస్తాకు గాను రూ.6000 చొప్పున మద్దతు ధరకు తగ్గువగా విక్రయించామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల రీత్యా తేమ శాతం నిబంధనలలో మార్పులు తీసుకురావాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

యానాం వార్తలు

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి, ఇతరులు

అంబేద్కర్‌కు ఘనం నివాళి

ప్రజాశక్తి - యానాం

భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఇన్‌ఛార్జ్ ఆర్‌ఎఒ టి.రవిశంకర్, ఎస్‌పి వరదరాజన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే గోపాల్ నగర్ అంబేద్కర్ విజ్ఞాన్ భవన్లో దళితనేతలు పండు సిద్ధార్థకుమార్, గిడ్డి బలరాం, చెల్లి గోపీ, పుల్లారావు, సబ్బతి లోకేష్, మనోజ్ నివాళులర్పించారు. గోపాల్ నగర్ మోకా వారి వీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, నామాడి అప్పారావు, గుర్రపు ప్రహ్లాద్, యాళ్ళ వెంకట్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే వ్యాపారవేత్త తోటరాజు నాయకత్వంలో పలు చోట్ల అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రజాసభలో మాట్లాడుతున్న ఎస్ఐ నూకరాజు

పోలీస్‌స్టేషన్‌లో ప్రజాసభ

ప్రజాశక్తి - యానాం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మక్కల్ మండ్రమ్ ప్రజాసభ కార్యక్రమం శనివారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో నిర్వహించారు. ఎస్‌పి వరదరాజన్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్ఎ అశోక్ పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలంలో మరణించిన పలువురు కుటుంబ సభ్యలను స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం పరామర్శించారు. బరంపేట గ్రామానికి చెందిన కమిడి మీరాదాస్, కొండమూరి రాజేశ్వరి, అన్యం సత్యనారాయణ, బుదిత శ్యామ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పండు సిద్ధార్థకుమార్, కొల్లు మాధవ స్వామి, కవల బాబులు, కొండమూరి భాస్కర్ రావు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఎంపిపితోపాటు, టిడిపికి చెందిన ఇద్దరు, ఇటీవల వైసిపి నుంచి టిడిపిలో చేరిన గాడిమొగ ఎంపిటిసి వనమాడి వేణి మాత్రమే హాజరయ్యారు. అయితే వైసిపికి చెందిన 14 మంది ఎంపిటిసిలు సమావేశానికి గైర్హాజరయ్యారు. అయితే నిర్ణీత సమయానికి కూడా పూర్తి స్థాయిలో ఎంపిటిసిలు హాజరుకాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ లక్ష్మణరావు ప్రకటించారు. సమావేశం ఎప్పుడనేది ఎంపిపి, ఇతర ఎంపిటిసి సభ్యులతో మాట్లాడి తెలియజేస్తామని అన్నారు.

సమానంగా నిధులు కేటాయించడం లేదు

తమకు సమానంగా నిధులు కేటాయించడం లేదని వైసిపి ఎంపిటిసిలు వెల్లడించారు. వైసిపి మండల అధ్యక్షులు కాదా గోవింద కుమార్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపి టిసిలు పోతుల రత్నకుమారి, కోరు కొండ కిరణ కుమారి మాట్లాడారు. గత రెండు మండల పరిషత్ సమావేశాల నుంచి ఎంపిటిసిలతో ఎటువంటి చర్చలు చేయకుండా నిధుల కేటా యింపు జరుగుతుందని ఆరోపించారు. ఉన్న నిధులను సమాన ప్రాతిపదికన కేటాయింపులు జరగడం లేదన్నారు. శనివారం జరగాల్సిన సమావేశం ఎజెండాలో కూడా పటవల, కోరంగి గ్రామాలకు మాత్రమే కేటాయింపులు చేశారని ఆరోపించారు. ఎంపిటిసిలకు ఇవ్వాల్సిన బకాయి గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించే వరకు సమావేశాలకు వెళ్లేది లేదని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి-2 కె.లలిత, ఎంపిటిసిలు ఆర్. నరసింహమూర్తి, జి.శ్రీనివాస్, కె.సత్య వెంకటకుమారి, ఎం.భీమాబాయి, బి. సంధ్యారాణి, టి.వరలక్ష్మి, ఎన్.శ్రీదేవి, కె.మహాలక్ష్మి, ఆర్.ముత్యాలు, కో ఆప్షన్ సభ్యులు కె.కృష్ణ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రామ టిడిపి అధ్యక్షుడు చల్లా బుజ్జి చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ శ్రీ కిరణ్ ఆస్పత్రి సౌజన్యంతో కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు ఉచితంగా జరిపించి ఆపరేషన్ల అవసరమైన వారిని ఎంపిక చేసి వారికి శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపిపి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని సూచించారు. అధికారులంతా ఆయా శాఖాల నివేదికలతో హాజరుకావాలని, సమావేశానికి గైర్హాజరు అయ్యే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దేవాలయాలను సందర్శించిన సమాచార శాఖ కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట, పిఠాపురం

స్థానిక భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఎపి సమాచార శాఖ ప్రధాన కమిషనర్ చావలి సునీల్ శనివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. వారికి ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం, ఆలయ ఛైర్మన్ కంటే జగదీశ్ మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇఒ నీలకంఠం వారికి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, దేవాదాయ శాఖ జిల్లా అధికారి కె. నాగేశ్వరరావు, తనిఖీ అధికారి వి.ఫణింద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం పాదగయను సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అసిస్టెంట్ కమిషనర్, ఇఒకాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు

కమిషనర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఒ నీలకంఠం

అనంతరం ఇఒ వారికి శేషవస్త్రాలతో సత్కరించి, చిత్రపటాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి కనపర్తి నాగేశ్వరరావు, ఆర్‌డిఒ మల్లిబాబు, తహశీల్దార్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి, సామర్లకోట

గండేపల్లి మండలం మల్లేపల్లి కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత ఉప కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కెహెచ్.నాయక్ పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా వచ్చే సదుపాయాలు, సౌకర్యాలు, ఉపకరణాలు, శస్త్ర చికిత్యలు భవిత కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.అన్నపూర్ణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం టి.విజయవల్లి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎస్.లోవ, జె.ప్రకాశరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు. సామర్లకోట భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఎంఇఒ పి.పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్.సత్యనారాయణతో పాటు ఇతర సేవాసంస్థల ప్రతినిధులు

గండేపల్లిలో బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్లు అనిత, పద్మావతి, ఐఇడిఎస్ఎస్ టీచర్లు జివివి.ప్రసాద్, బేబీ నాగేశ్వరి, పెద్దాపురం ట్రస్ట్ నాయకులు నరేంద్ర, జిల్లా మానవ హక్కుల అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, హైస్కూల్ హెచ్‌ఎంలు తోటకూర సాయిరామ్, కృష్ణా ఎస్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిరు సంచుల క్షేత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గోరింటలో చిరు సంచుల క్షేత్ర ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రామకష్ణ, కోటేశ్వరరావు పొలంలో ఆర్‌జిఎల్ 7045 వరి రకాన్ని సిరి సంచి రకం వేసిన పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతులకు చిరు సంచి లక్షణాలను వివరించారు. ఈ గింజ బిపిటి రకం గింజ కన్నా కొంచెం మోటుగా ఉంటుందని, కాల పరిమితి బిపిటి కన్నా 15 రోజులు ఎక్కువని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్

క్షత్ర దినోత్సవంలో రైతులు, అధికారులు

ఎ.సీతారామశర్మ, స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ యు.సుధీర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వల్లభునికి రూ.2.22 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.22 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,34,140, అన్నదాన విరాళాల ద్వారా రూ.64,141, కేశఖండన ద్వారా రూ.5,640, తులాభారం ద్వారా రూ.500, లడ్డు ప్రసాద్ ద్వారా రూ.17,595 వెరసి రూ.2,22,016 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య, సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శనివారం రామకృష్ణ సమితి, వివేకానంద ట్యుటోరియల్స్ సౌజన్యంతో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సమితి ప్రతినిధి స్వామీ లోకమయానంద, సిఐ అంకబాబు చేతుల మీదుగా యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో వ్యయప్రయాసలతో యుటిఎఫ్ ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్‌ను రూపొందించారని, ఆ మెటీరియల్‌పై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం వివేకానంద ట్రస్ట్ సభ్యులు గోపాలకృష్ణ, బలరాం, వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు కాలువను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

మురుగు కాలువ పరిశీలన

ప్రజాశక్తి - కరప

మండలంలోని సహపురం మురుగు కాలువను ఆత్మ ఛైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్ రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. మురుగు కాలువ దుస్థితిని రైతులు ఎంఎల్ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ సూచనతో సహపురం మురుగు కాలువను పరిశీలించినట్లు ఆత్మ ఛైర్మన్ తెలిపారు. మురుగు కాలువపై వంతెన లేకపోవడంతో పడుతున్న బాధలను రైతులు ఆయనకు వివరించారు. క్షేత్ర స్థాయిలో తాను పరిశీలించిన వాస్తవ పరిస్థితిని ఎంఎల్ఎ పంతం నానాజీకి వివరిస్తానని ఆయన మీడియాకు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ పర్యటనలో సొసైటీ ఛైర్మన్ సైనవరపు భవానిశంకర్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, కరెడ్ల చిలకమ్మా, గొర్రెల కామేశ్వరరావు, తుమ్మలపల్లి సూర్యనారాయణ, పేకేటి దుర్గాప్రసాద్, పేపకాయల అంజి, పెంకె వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

13న మాలల ఆత్మీయ సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 13న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా బట్నవిల్లి నేషనల్ హైవే జంక్షన్లో జరిగే మాలల ఆత్మీయ సమారాధనకు తరలిరావాలని ఆహ్వాన కమిటీ ప్రతినిధి ఇసుకపట్ల రఘుబాబు కోరారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ తర్వాత మాలల అవకాశాలు పూర్తిగా కోల్పోతున్నారని, మన ఐక్యతను చాటడానికి ఇదే సరైన తరుణమని అన్నారు. ఈ సమావేశంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు నాతి శ్రీను, జల్లి శ్రీను, నాయకులు జక్కల ప్రసాద్ బాబు, కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, పినిపే నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

బొంతు ఇందిర, భర్త: బొంతు కొండయ్య, డోర్ నెం.6-109, త్యాజంపూడి గ్రామం, దేవరపల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా, అను నేను ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా పాస్‌పోర్ట్ నెం.G0417196, 2006వ సంవత్సరంలో పోయినది. అప్పుడు ఎంత వెతికిన దొరకలేదు. మరలా 2013లో కొత్త పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోగా కొత్తగా వచ్చిన ఆధార్ ఐడితో నాకు పాస్‌పోర్ట్ నెం.K9236471తో కొత్త పాస్‌పోర్ట్ జారీచేశారు. నేను ఈ పాస్‌పోర్ట్ నెం.K9236471తో సుమారు 10 సంవత్సరాలు ఇతర దేశాలలో పని చేశాను. అప్పుడు ఆ పాస్‌పోర్ట్ నెం.K9236471 గడువు ముగియడంతో రిన్యూవల్ కోసం భీమవరం పాస్‌పోర్ట్ ఆఫీసుకు వెళ్ళినప్పుడు అక్కడ వారికి 2006లో ఆధార్ ఐడి లేకుండా జారీ చేసిన పాస్‌పోర్ట్ నెం.G0417196 చూపించుచున్నది. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా పాస్‌పోర్ట్ నెం.G0417196 గల పాస్‌పోర్ట్ 2006 లోనే పోయినది. నేను పాస్‌పోర్ట్ నెం.K9236471 ను రెన్యూవల్ చేయించుకొనుచున్నాను. వీటిపై అన్ని చట్టరీత్యా చర్యలకు నేను బాధ్యురాలిని అవుదును.

CHANGE OF NAME

My old name is PUDI PUSHPA. My new name and changed name is KATARI PUSHPA. Since today onwards, Iam being called as KATARI PUSHPA.

KATARI PUSHPA
D.No. 85-51-52, My Home Apartment, Flat No.C-2, 2nd Street, Model Colony, V.L.Puram, Rajamahendravaram - 533101, E.G.District. Cell: 9492422266

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు కాకినాడ
M.V.O.P.No.138/2024

Between:-
కొల్లు రాజ్యలక్ష్మి ...పిటిషనర్
మరియు
సిగటాపు దుర్గ ప్రసాద్ వగైరాలు ...రెస్పాండెంట్స్

R2. లక్ష్య ట్రేడర్స్ and లాజిస్టిక్స్ Rep by మురళిశెట్టి నాగప్రసాద్ వయస్సు 40 సం॥లు, లాల్ బహుదూర్ శాస్త్రి స్ట్రీట్ అశోక్‌నగర్, కాకినాడ, కాకినాడ జిల్లా, వ్యాన్ యజమాని బెరింగ్ నెం.AP16TS 0001

పై నంబర్ పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం ది.09-12-2025 వ తేదిన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో పై పిటిషను మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)
K.V.Bhadra Rao
K.Srivani
K.S.Chandra Rao
Advocates, Kakinada
Cell. 9440177063

మహారాజశ్రీ రామచంద్రపురం 13వ అదనపు జిల్లా జడ్జి
A.S.No.131/2024

Between:-
బొగ్గవరపు సూర్యనారాయణ ...అపిలెంట్
మరియు
బొగ్గవరపు శ్రీరామం మరియు అదర్స్ ...రెస్పాండెంట్స్

R10. బొగ్గవరపు సత్యన్నారాయణ మూర్తి తండ్రి(లేట్) సత్యన్నారాయణ, వయసు 58, హిందు, C/o. బొగ్గవరపు శ్రీరామం, డోర్‌నెం. 5-77, తాపేశ్వరం, మండపేట మండలం.

పై నెంబరులో 10వ రెస్పాండెంట్‌కు కోర్టువారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అందుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు సమన్లు నిమిత్తం కోర్టువారు పత్రికా ప్రకటన ద్వారా హాజరు కావలసినదిగా 18-12-2025 ఉదయం 10.30 గం॥లకు కోర్టువారి ఎదురుగా స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అవ్వగలరు అట్లుకానిచో మీకు పరోక్షంగా నిర్ణయంను కోర్టువారు తీసుకొనగలరు అని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
సాలగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం
నందిక కళ్యాణి
రామచంద్రపురం అడ్వకేట్స్,రామచంద్రపురం
ది.5-12-2025 సెల్.9908854154

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.88/2025 I.A.No.603/2025

Between:-
Dangeti Srinivasa Rao ...Plaintiff
And
Satyam Srinivas S/o. Satyam Satyanarayana, Hindu, Age.52 years, Resident of D.No.4-59/1, Pathuri Street, Diwancheravu, Rajahmundry JCJ. ...Defendant

పై నంబరు దావాలో డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు.కావున ది.12-12-2025 సం॥రం తేదీ ఉదయం10.30ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
B.S.శ్రీనివాస్
రాజమండ్రి అడ్వకేట్
ది.05-12-2025 రాజమండ్రి

In the Court of the VII Additional district and Sessions Judge at Peddapuram
O.P.No.228/2025

Between:-
Putcha Manikanta Reddy @ Mark kumar Reddy ...Petitioner
and
Putcha (Padala) Praharsha @ Angel Vimala ...Respondent

To.
Putcha(Padala) Praharsha @ Angel Vimala W/o.Putcha Manikanta Reddy @ Mark kumar Reddy D/o. Padala Durga Reddy, Age 26 years R/o.D.No.3-164/1, Cheediga, Kakinada Rural(M) Kakinada district.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భార్య అయిన మీపై కాపురమునకు రమ్మని పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టువారి ద్వారా మీకు నోటీసు పంపినను మీరు తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నారు. కావునా శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.23-12-2025 తేదికి వాయిదా వేసినారు మీరు ఆరోజు ఉదయం గం10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం
Relangi Venkata Ramana
Advocate, Kakinada.
Cell.7013306375

వేలం ప్రకటన
మహారాజశ్రీ రాజమహేంద్రవరం 1వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి (సీనియర్ డివిజన్) కోర్టులో
E.P. No. 66/2023
O.S. No. 158/2010

Between:
Bathula Venkata Lakshmi, W/o. Balarama Krishna, Syamala Nagar, Rajamahendravaram ...DHr
AND
Karri Nukaraju, S/o. Venkata Rao, Kamarajupeta, Gokavaram Mandal, RJCJC. ...JDr

యీ దిగువ షెడ్యూలు దాఖలా JDr తాలూకు స్థిరాస్తి యిస్తిహారు పరతులకు లోబడి దివి. 24-12-2025 సం॥రం తేదీ ఉదయం గం॥ 10.30 లగాయితు పై కోర్టులో శ్రీ కోర్టు వారిచే వేలం వేయబడును. వేలం పాట వివరములు మెదలగు సంజాయిషీ కావలసిన వారు DHr గారి తరపు అడ్వకేటు గారి ఆఫీసులో తెలుసుకొనవచ్చును.

SCHEDULE

East Godavari District, Gokavaram Mandal, Sudikonda Village, zeroity land R.S. No. 77 an extent of Ac. 0.79 cents in full extent of Ac. 6.62 cents bounded by:
EAST: Land of Kokkirala Durga Prasad.
SOUTH: Land of Kokkirala Ramalakshmi.
WEST: Land of Pendreddy Suryanarayana.
NORTH: Puntha.

Ac. 0.79 cents DHr Value: Rs. 2,00,000/-
JDr's Value: Not given
Amin Value as per test report: Rs. 19,75,000/-
SRO Value: Rs. 7,90,000/-

సిహెచ్.ప్రభాకరరావు
Rajamahendravaram Advocate for DHr
Dt: 07-11-2025 రాజమండ్రి